అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

పుట్టుకతో అంగవైకల్యం ఉన్నవారిని గుర్తించాలి

అడిషనల్ కలెక్టర్ సుధీర్

మర్పల్లి, ఏప్రిల్ 8 : పుట్టుకతో అంగవైకల్యం కలిగిన పిల్లలు, పెద్దలను గుర్తించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాలులో జిల్లా వైద్యరోగ్య శాఖ అధికారి, ఆకార్ ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లతో అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దల్లో పుట్టుకతో వచ్చిన లోపాలు, అంగవైకల్యం గురించి, లోపాలను గుర్తించడం.. వారిని గ్రామస్థాయిలో ఎలా గుర్తించాలనే దానిపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. గ్రహణం, మొర్రి, అంగిళ్లలో లోపాలు ఏర్పడటం, నాలుక అతుక్కొని ఉండటం, చెవులు లేకపోవడం, కాళ్లు, చేతి వేళ్లు, కనుబొమ్మలు, జంతు ప్రమాదాలు, కాట్ల వల్ల జరిగిన వాటితో పాటు అనేక లోపాలకు ఆకార్ ఆశ స్వచ్ఛంద సంస్థ శస్త్ర చికిత్సతో సరిచేయవచ్చనే విషయాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సంస్థ ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. అనంతరం జిల్లా వైద్యారోగ్య అధికారి వెంకటరమణ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో జయసుధ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఉప వైద్యాధికారి జీవరాజ్, డాక్టర్లు, తహసీల్దార్ మునిరోద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య, ఎంపీవో లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

నీటి సమస్య రానివ్వొద్దు

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

జల్‌పల్లిలో ఎస్ఎన్‌డీపీ నాలాను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్/పహాడీషరీఫ్, ఏప్రిల్ 8 : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్ వర్క్స్ అధికారుల(హెచ్ఎం డబ్ల్యూఎస్ అధికారులు)తో సమీక్షా సమావేశం నిర్వహించారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎస్ఎన్‌డీపీ నాలాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న నాలా పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనుల విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవన్నారు. ఎస్ఎన్‌డీపీ నాలా పెండింగ్ పనులతోపాటు ఏయే కాలనీల్లో తాగునీటి సమస్య జఠిలంగా ఉందో గుర్తించాలని ఆమె మున్సిపల్, వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. వేసవికాలం పోయేంతవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి నీటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. చాలా కాలనీల్లో ఇప్పటికే నీటి సమస్యలున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. అధికారులెవరు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీ లున్నా వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఇప్పుడే నీటి సమస్య ఇలా ఉంటే.. ఇక రానున్న రోజుల్లో నీటి సమస్య జఠిలంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఉన్న నీటిని ఏ విధంగా పొదుపుగా వాడుకోవచ్చునో అధికారులు ప్రజలకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. నీటిని వృథా చేయకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో 100 శాతం పేదలే నివసిస్తున్నారన్నారు. వారందరూ బోర్లు వేసుకోలేని పరిస్థితిలో ఉన్నారు కనుక కృష్ణా వాటర్‌పైనే ఆధారపడి ఉంటారన్నారు. ట్యాంకర్లు కొనుక్కునే స్థోమత వారికి లేదన్నారు. వేసవికాలం పోయేంతవరకు సక్రమంగా నీటి సరఫరా జరగాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రాం, జలమండలి అధికారులు, వాటర్ లైన్‌మెన్ మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చూస్తున్న బృందం సభ్యులు

చీమల్‌దరికి యూపీ బృందం

- 2023లో సుపరిపాలన (నేషనల్ అవార్డు) రావడంతో బృందం పర్యటన
- అభివృద్ధిని చూసి మెచ్చుకున్న బృందం

వికారాబాద్, ఏప్రిల్ 8 : మోమిన్‌పేట మండలం చీమల్‌దరి గ్రామంలో ఇదివరకు జరిగిన అభివృద్ధి తీరుపై మంగళవారం ఉత్తరప్రదేశ్ బృందం 24 మంది పర్యటించారు. 2023లో చీమల్‌దరి గ్రామంలో జరిగిన అభివృద్ధికి సుపరిపాలన, (నేషనల్ అవార్డు) వచ్చింది. ఇందులో భాగంగా చీమల్‌దరి గ్రామాన్ని సందర్శించేందుకు యూపీ బృందం ప్రత్యేకంగా రావడం జరిగింది. గ్రామంలోని సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, పల్లె ప్రకృతి వనం, అంగన్‌వాడీ కేంద్రం, ఇంటర్నెట్ సేవలు, పంచాయతీ భవనం తదితర వాటిని పరిశీలించారు. అనంతరం చీమల్‌దరి గ్రామంలో జరిగిన అభివృద్ధిని సంబంధిత అధికారులు పాఠశాలలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృందం సభ్యులకు వివరించారు. గత సర్పంచ్ హయాంలో అభివృద్ధి జరిగిందని బృందం సభ్యులు తెలుసుకున్నారు. గ్రామమంతా చాలా బాగుందని అభినందించారు. ఉత్తర్ ప్రదేశ్ బృందంలో సర్పంచ్‌లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. బృందంతోపాటు డీఎల్‌పీవో సుధారాణి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శి భరత్ ఉన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు గడువు 14 వరకు పొడిగింపు

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, ఏప్రిల్ 8 : నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు గడువును ఈ నెల 14 వరకు పొడిగించడం జరిగిందని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకంపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం కింద అన్ని కార్పొరేషన్‌లకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసేందుకు రేషన్ కార్డు లేదా ఆహార భద్రతా కార్డు ఉంటే సరిపోతుందని, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అన్ని మున్సిపాలిటీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండల, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పీడీడీఆర్ డీఏ, ఈడీ ఎస్‌సీ కార్పొరేషన్ అధికారులు నోడల్ అధికారులుగా ఉన్నారని, బ్యాంక్ మేనేజర్లు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎల్ఆర్ఎస్ ప్రక్రియను కూడా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు.

కండ్లకోయ ఐటీ పార్క్ కలేనా..?

- 2022లో ఐటీ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన
- నిర్మాణ పనులను పట్టించుకోని రేవంత్ సర్కార్
- అనుమతుల జారీలో హెచ్ఎండీఏ నిర్లక్ష్యం



కండ్లకోయలో ఏర్పాటు చేయబోయే ఐటీ పార్క్ బిల్డింగ్ నమూనా చిత్రం

మేడ్చల్, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ): కండ్లకోయ ఐటీ పార్క్ నిర్మాణ పనులలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. హైదరాబాద్ నగరానికి నాలుగు వైపులా ఐటీ రంగాన్ని విస్తరించేలా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలో 12 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా 2022 సంవత్సరంలో కండ్లకోయ ఐటీ పార్క్ ఏర్పాటుకు అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయడంతో పాటు నిధులను మంజూరు చేసి టెండర్లను ఆహ్వానించిన విషయం విదితమే. వాస్తవానికి 2026 సంవత్సరంలో ఐటీ పార్క్ నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా.. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఐటీ పార్క్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యాయి. ఈ క్రమంలో ఐటీ పార్క్ నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో అన్నది ప్రశ్నార్థకరంగా మారింది.

అనుమతుల జారీలో నిర్లక్ష్యం..

ఐటీ పార్క్ నిర్మాణ పనులకు సంబంధించి వివిధ శాఖల నుంచి అనుమతి లభించినప్పటికీ హెచ్ఎండీఏ అనుమతివ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పనులు నత్తనడకన సాగుతున్నట్లు విమర్శలున్నాయి. హెచ్ఎండీఏ ఉన్నతాధికారులపై ప్రజాప్రతినిధుల ఒత్తిడి తెచ్చి అనుమతులు ఇచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. కండ్లకోయ ఐటీ పార్క్ శంకుస్థాపన సమయంలోనే ఐటీ కంపెనీల ఏర్పాటుకు 100 వరకు కంపెనీలు రిజిస్ట్రేషన్లు చేసుకున్నాయి. ఐటీ పార్క్ నిర్మాణం పూర్తయితే 200 వరకు ఐటీ కంపెనీల ఏర్పాటుకు అనువుగా ఉండేలా నమూనాను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇది కార్యరూపం దాల్చి ఉంటే వేలాది సంఖ్యలో ఐటీ ఉద్యోగాల కల్పన జరగడంతో పాటు మేడ్చల్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశముండేదన్నారు. దీనికితోడు ఈ ప్రాంతంలో వ్యాపారాలు వృద్ధి చెంది అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించేదన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కైటీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఐటీ పార్కు నిర్మాణం చేపట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు స్థానిక అభివృద్ధికి సహకరించాలని కోరారు.

తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం సందర్శన

కొహెడలో నిర్మిస్తున్న గోదాములను పరిశీలిస్తున్న ఒడిశా సహకార సంఘం బృందం

తుర్కయాంజాల్, ఏప్రిల్ 8 : సహకార శిక్షణలో భాగంగా ఒడిశా రాష్ట్రం రైడ జిల్లాకు చెందిన 15 రైతు సంఘాల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు,పాలకవర్గ సభ్యులు మంగళవారం తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం ప్రధాన శాఖను సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం చేపడుతున్న పనులను ఆ సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొహెడలో రైతుల కోసం నిర్మిస్తున్న 3 గోదాములు, కోల్డ్ స్టోరేజ్‌ను పరిశీలించారు. సంఘంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి ఒడిశా పాలకవర్గ బృందం అధ్యక్షుడు సత్తయ్య పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, పాలకవర్గ సభ్యులు, సెక్రెటరీ రాందాస్ పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించినవారిపై చర్యలు తీసుకోవాలి

పూడూరు, ఏప్రిల్ 8 : పూడూరు మండలం చన్గోముల్ గ్రామానికి సోమవారం ఇన్‌కమ్ టాక్స్ (ఐటీ) శాఖ అధికారులు బెగరి ప్రభాకర్ ఇంటికి ఆకస్మికంగా వచ్చారు. వారిని ప్రభాకర్ కంగుతిన్నారు. చన్గోముల్‌లోని ప్రభాకర్ ఇంటిని వరంగల్‌కు చెందిన రవళి అద్దెకు తీసుకొని వ్యాపారం చేస్తున్నట్లు చూపుతూ నకిలీ పత్రాలను అందజేసినట్లు వచ్చిన ఐటీ అధికారులు తెలిపారు. ఆధార్ కార్డు ఆధారంగా ప్రభాకర్ వారికి ఇంటిని అద్దెకు ఇచ్చినట్లు పత్రాలను సృష్టించినట్లు చెప్పారు. తమ ఇంటి నంబర్, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లుతో కొత్తగడి గ్రామం, వికారాబాద్ మండలానికి చెందిన జంగయ్య అనే వ్యక్తి రవళి అనే మహిళకు అగ్రిమెంట్ చేసినట్లు తేలింది. కొన్ని రోజుల క్రితమే ఆ ఇంటిని గ్రామంలో మరో వ్యక్తికి అమ్మేసినట్లు ప్రభాకర్ తెలిపారు. తనకు తెలియకుండానే తన పేరున ఇంటిని అద్దెకిచ్చినట్లు తప్పుడు పత్రాలతో ఐటీ అధికారులకు చూపించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ప్రభాకర్ చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేపు జాబ్ మేళా

వికారాబాద్, ఏప్రిల్ 8 : శ్రీమంత్ర టెక్నాలజీస్ సంస్థలో ఉద్యోగాల కోసం గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, ఐటీఐ క్యాంపస్ వికారాబాద్‌లో ఏప్రిల్ 10 గురువారం ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీమంత్ర టెక్నాలజీస్ సంస్థలో సుమారు 50 మందికి బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్-టెలికాం సెక్టార్, డాక్యుమెంటేషన్ ఎగ్జిక్యూటివ్-లాజిస్టిక్స్ సెక్టార్, ఎంఐఎస్ డేటా అనలిస్ట్ ఫైనాన్సియల్ సర్వీసెస్-డీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించబడుతాయని పేర్కొన్నారు. వీటికి 18 నుంచి 27 సంవత్సరాలలోపు నిరుద్యోగ యువత అర్హులని తెలిపారు. ఈ ఉద్యోగానికి పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఉద్యోగాలు హైదరాబాద్‌లో కల్పించబడునని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియాసాబ్ 9676047444 ద్వారా సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఓయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం
- అడ్మినిస్ట్రేన్ భవనం ఎదుట బైఠాయించి నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 8: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు అధ్యాపకులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం తరగతులు బహిష్కరించి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ..యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్ల సమస్య పరిష్కరించకుండా జీవో 21ను తీసుకువచ్చారని.. ఇది యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఆరోపించారు. తక్షణమే ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తమ సమస్యలను పరిష్కరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ రేష్మారెడ్డి, డాక్టర్ మోడెం రవి, డాక్టర్ ఓ కృష్ణయ్య, డాక్టర్ తాలపల్లి వెంకటేశ్, డాక్టర్ మహేందర్, డాక్టర్ అరుణ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ అశోక్, డాక్టర్ వాణి, డాక్టర్ హరీశ్, డాక్టర్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కోఠి మహిళా వర్సిటీలో తరగతుల బహిష్కరణ

జియాగూడ, ఏప్రిల్ 8 : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో పాటు జీవో 21ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం తరగతులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. ఆ వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ ఉపేందర్ రావు మాట్లాడుతూ..కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించిన తర్వాతే మాత్రమే... కొత్త నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చేంత వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ ఈ ఉపేందర్ రావ్, డాక్టర్ వినీత పాండే, డాక్టర్ రజిని, డాక్టర్ సనత్, డాక్టర్ రవి, డాక్టర్ సునీత, జ్యోతి, డాక్టర్ కృష్ణ వేణి, డాక్టర్ కృష్ణాజి, డాక్టర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ ఆనంద ఉన్నారు.

విత్తన చట్టాన్ని తీసుకురావాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 8: నాణ్యమైన విత్తనాల సరఫరా, ప్రైవేట్ కంపెనీల నకిలీలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం విత్తన చట్టాన్ని తీసుకోవాలని సెంటర్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ప్రతినిధి దిలీప్ రెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పబ్లిక్ పాలసీ నిపుణులు డాక్టర్ దొంతి నర్సింహా రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. జన్యు మార్పిడి విత్తనాల వల్ల రైతులు, భూమికి తీరని నష్టం జరుగుతుందని, అలాంటి విత్తనాలపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. ఈ నెల 5, 6న ఆన్మాస్‌పల్లిలోని ది ఎర్త్ సెంటర్‌లో నిర్వహించిన విత్తన పండుగ విజయవంతమైందన్నారు. ఈ సందర్భంగా అనేక తీర్మాణాలు చేశామన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో దేశీ విత్తనాలపై పుస్తకాలు ప్రచురించి విద్యార్థులకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వ్యవస్థాకులు కె. లక్ష్మా రెడ్డి, అధ్యక్షురాలు కె. లీలా లక్ష్మా రెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు : సీపీ

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ) : ఈ నెల 12న జరుగనున్న వీరహనుమాన్ విజయయాత్ర(శోభాయాత్ర) సందర్భంగా మంగళవారం హైదరాబాద్ పోలీస్ అధికారులతో సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో జరిగిన విజయయాత్ర సందర్భంగా జరిగిన సంఘటనలు, బందోబస్తు ఏర్పాట్లపై చర్చించి వాటి అనుభవాల నేపథ్యంలో ఈసారి యాత్రను విజయవంతం చేయడానికి కావలసిన సూచనలు చేశారు. చిన్న ఊరేగింపులు అనుసంధానమయ్యే కూడళ్ల వద్ద , మతపరమైన ప్రదేశాల వద్ద, సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ప్రత్యేక అదనపు బలగాలను మోహరించి నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో లా అండ్ ఆర్డర్ అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్‌మాన్, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ చైతన్యకుమార్, ఐటీ సెల్ డీసీపీ పుష్ప., వర్చువల్‌గా జోనల్ డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఓయూ విద్యార్థులను కేసుల పేరుతో వేధిస్తున్నారు

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

ఉస్మానియా యూనివర్సిటీ : రైతుల పక్షాన ఉద్యమించిన నేరానికి వాళ్లంతా న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని.. ఇదేనా ప్రజా పాలనా అని ప్రశ్నించిన నెపానికి చదువుకు దూరమవ్వాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. ఓయూలో నీటు సంపాదించి ఉన్నత చదువులు అభ్యసిస్తున్న పలువురు విద్యార్థి నాయకులు ప్రజా ప్రభుత్వంలో లగచర్ల రైతుల భూములను లాక్కుంటూ వారిపై రేవంత్ ప్రభుత్వం జరిపిన దాష్టీకాన్ని వ్యతిరేకిస్తూ ఓయూ వేదికగా నిరసన తెలుపగా.. గతంలో ప్రభుత్వం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది. ప్రభుత్వ పెద్దలు ఘనంగా చెప్పుకుంటున్న ఇందిరమ్మ రాజ్యం మోపిన తప్పుడు కేసులను ఎదుర్కొనేందుకు విద్యార్థులు న్యాయస్థానాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆయా కేసులకు సంబంధించి నాంపల్లి క్రిమినల్ కోర్టులో ఓయూ విద్యార్థి నేతలు మంగళవారం కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు మోపినా తాము విద్యార్థులు, రైతులు,ప్రజలకు మద్దతుగా పోరాడుతూనే ఉంటామని, విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు.

సాహిత్యాన్ని సృష్టించే కవి సిధారెడ్డి

ఆచార్య అనుమాండ్ల భూమయ్య

రవీంద్రభారతి, ఏప్రిల్ 8 : ఆచార్య చెన్నకేశవరెడ్డి 81వ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆచార్య చెన్నకేశవరెడ్డి సాహిత్య పురస్కారాన్ని కవి నందిని సిధారెడ్డికి రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన భూమయ్య జ్యోతి ప్రజ్వలన చేసి నందిని సిధారెడ్డికి చెన్నకేశవరెడ్డి సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. హృదయం ద్రవివింపజేసే సాహిత్యాన్ని సృష్టించే సిధారెడ్డి అని.. తెలంగాణలో నాగేటి చాళ్లు అనే పుస్తకం రాయడానికి సిధారెడ్డి రాసిన పాటే కారణమన్నారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, డా.మల్లారెడ్డి, డా.జలంధర్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొని ప్రసంగించారు. జయమిత్ర, జగన్, సూర్యప్రకాశ్, సభాధ్యక్షుడిగా వేణుగోపాల్ పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 8: పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంచుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు అన్నారు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో గల ప్రచురణ విభాగం ముద్రించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించేందుకు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను నిత్యానందరావు మంగళవారం ప్రారంభించారు. ఈనెల 17వ తేదీవరకు పుస్తక ప్రదర్శన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని డిప్యూటీ రిజిస్ట్రార్ ఏఎన్ జగదీష్ పేర్కొన్నారు. పుస్తకాలపై 60శాతం వరకు ప్రత్యేక రాయితీ కలదని ప్రచురణల విభాగం సంచాలకులు ఎంవీ ఆదిలక్ష్మి తెలిపారు. వర్సిటీ సహాయ సంచాలకులు బీ శ్రీనివాస్‌గౌడ్, ప్రచురణ విభాగం సూపరిండెంట్ రాజ్‌కుమార్, యాదయ్య, ప్రవీణ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన వీసీ నిత్యానందరావు తదితరులు

'గోర్‌బోలీ'ని 8వ షెడ్యూల్లో చేర్చాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 8 : లంబాడీల గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చాలని గోర్ జీవన్ పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్ట్ ఎస్‌కే రామచంద్రానాయక్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో